ప్రజాశక్తి

గురువారం 11 మే 2023

8 పేజీలు

విశాఖపట్నం · అనకాపల్లి







ఇక పర్యటనలే పర్యటనలు

- నేడు నగరానికి ముఖ్యమంత్రి జగన్
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

2024 ఎన్నికలు సమీపిస్తుండడంతో విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంతంలో పర్యటనలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ప్రాధాన్యతగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాలకు ఆయన కదలికలు ఉన్నా ఉత్తరాంధ్ర అంటే ప్రత్యేకంగానే ఆ పార్టీ శ్రేణులు చెప్పడం తెలిసిందే. విశాఖను రాష్ట్ర పరిపాలనా రాజధానిగా చేసుకోవడంతో పర్యటనల తాకిడి నగరం ముఖద్వారంగా ఇటువైపు పెరగనుంది. ఈ నేపథ్యంలో విశాఖకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉదయం రానున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ఆయన శ్రీకారం చుట్టనున్నారు. విశాఖను రాజధానిగా ప్రకటించిన వైసిపి ప్రభుత్వం, సిఎం వైఎస్ జగన్ విశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి, శంకుస్థాపనలు చేశాక గాని అడుగుపెట్టరన్న విషయాన్ని ఇప్పటికే విశాఖ, రాష్ట్ర వైసిపి నేతలు ప్రచారం చేస్తున్నారు. ఇటీవల విశాఖకు విచ్చేసిన సందర్భంగా అదానీ డేటా సెంటర్‌కు పునాదిరాయి వేశారు. తాజా పర్యటన సందర్భంగా పిఎం పాలెం స్టేడియంలో వైఎస్ఆర్ విగ్రహావిష్కరణ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. ఆరిలోవ అపోలో ఆసుపత్రిలో కేన్సర్ యూనిట్‌ను ప్రారంభిస్తారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సాయికాంత వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాధన్ సిఎం పర్యటన ప్రదేశాలను పర్యవేక్షించారు.

నేటి ప్రాజెక్టులన్నీ అనేక ప్రత్యేకతల కలబోత...

రామ్‌నగర్‌లోని విఎంఆర్‌డిఎ కాంప్లెక్స్, ఎంవిపిలోని ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను కూడా సిఎం ప్రారంభిస్తారు. ఎండాడలోని కాపు భవనం, భీమిలిలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్నారు. భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇతర నేతలు, కార్యకర్తలతో జగన్ ప్రత్యేక సమావేశాన్ని కూడా ఈ సందర్భంగా నిర్వహించనున్నారు. సీ హారియర్ యుద్ధ విమానం అనేక రక్షణ రంగ ప్రత్యేకతలతోనూ కలగలిసి ఉంటుంది. ప్రపంచంలో రెండు చోట్లే సీ హారియర్ మ్యూజియం ఇప్పటివరకూ ఉండగా విశాఖ కూడా తాజాగా మూడో స్థానం దక్కించుకుంది. సుమారు రూ.10కోట్లతో నిర్మించారు. టూరిస్టులకు వినోదాన్నే కాదు రక్షణ రంగ విజ్ఞానాన్ని కూడా అందించనుంది. ఇప్పటికే టియు 142, కురుసుర సబ్‌మెరైన్ ఆర్‌కెబీచ్‌లో కొలువైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో జరిగే పాయకరావుపేట వైసిపి ఎమ్మెల్యే కుమారుడి వివాహ రిసెప్షన్‌కు జగన్ హాజరవుతారు.

ఎంవిపిలోని స్పోర్ట్స్ ఎరీనా సైతం 300 మంది ప్రేక్షకులు కూర్చొని క్రీడా కార్యక్రమాలు తిలకించేలాగ అధునాతన హంగులతో తీర్చిదిద్దడం ప్రత్యేకతగా నిలిచాయి. సిఎం గత విశాఖ పర్యటన అంతా హెలికాప్టర్‌లోనే వేదికల

మిగతా 2లో..



భిక్షాటన చేస్తూ ప్రదర్శనగా వెళ్తున్న క్లాప్ డ్రైవర్లు, అగ్రభాగంలో వెంకటరెడ్డి

రూ.18,500 జీతం చెల్లించాలంటూ..

క్లాప్ డ్రైవర్ల భిక్షాటన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జెసిఎల్ ఆదేశం మేరకు జిఒ 7ను అనుసరించి క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకు వందలాదిమంది క్లాప్ డ్రైవర్లు భిక్షాటన చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయం గేటు వద్ద రూ.18,500 జీతం చెల్లించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ, గురువారం విశాఖ నగరానికి వస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన స్వహస్తాలతో విడుదల చేసిన జిఒ 7 ప్రకారం రూ.18,500 వేతనం వివక్ష లేకుండా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జాయింట్ లేబర్ కమిషనర్ ఇచ్చిన డైరెక్షన్‌ను అమలు చేయించాలని కోరారు. యూనియన్ తరపున ముఖ్యమంత్రిని కలవడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ దోపిడీ వ్యవస్థ లేకుండా ఆప్కాస్‌ను తెచ్చామని జిఒ 136 తెచ్చాక, మరలా క్లాప్ డ్రైవర్ల వ్యవస్థలో కాంట్రాక్టర్‌ను పెట్టడం సమంజసం కాదన్నారు. సిఎం ఇచ్చిన జిఒ ప్రకారం రూ.18,500

మిగతా 2లో..

నక్కపల్లిలో రోడ్డు ప్రమాదం : 13 మందికి గాయాలు

▶ వార్త 8లో..

'జగనన్నకు చెబుదాం' ఎన్నికల స్టంట్! : వంగలపూడి అనిత

▶ వార్త 4లో..

పెన్షనర్ల సమస్య పరిష్కారానికి పోస్టు కార్డు ఉద్యమం

▶ వార్త 4లో..



విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించి కేంద్రానికి పంపుతున్న పోలీసులు

ప్రశాంతంగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

వార్తలు లోపలి పేజీల్లో...



విశాఖలో నాగ చైతన్య సందడి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ పతాకంపై పవన్ కుమార్ సమర్పణలో వెంకట్ ప్రభు దర్శకత్వంలో అక్కినేని నాగ చైతన్య కథానాయకుడిగా తెలుగు, తమిళ భాషల్లో రూపొందించిన కస్టడీ చిత్రం ఈ నెల 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉదయం విశాఖలోని నోవాటెల్ హోటల్‌లో

మిగతా 2లో..

104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



డిఎం అండ్ హెచ్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న 104 ఉద్యోగులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : 104 ఎంఎంయు ఉద్యోగులను ఆప్కాస్‌లో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన మేరకు వీరందరినీ రెగ్యులర్ చేయాలని ఎపి 104 ఎంఎంయు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు పి.మణి, అధ్యక్షుడు బి.తాతబాబు, కార్యదర్శి ఎస్‌కె ఖాసీం డిమాండ్‌చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వారం రోజులపాటు చేపట్టిన ఆందోళనలో భాగంగా బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన మేరకు 104 ఉద్యోగులు అందరినీ రెగ్యులర్ చేయాలని, జీవో 4459 ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని, యాజమాన్యం చెల్లించాల్సిన కాంట్రిబ్యూషన్‌ను అరబిందో సంస్థ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా వేతనాలు సక్రమంగా చెల్లించాలని, బకాయి వేతనాలు అందించాలని కోరారు. వాహనాలకు సకాలంలో సర్వీసింగ్ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.ప్రకాష్, అప్పలరాజు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఇక పర్యటనలే పర్యటనలు...

వద్దకు సాగగా, ఈ దఫా మాత్రం రోడ్డు మార్గంలోనే ఉంటుంది.

సెప్టెంబర్ నుంచి విశాఖ కేంద్రంగా సిఎం పాలన

ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి విశాఖకు తాను తరలి వస్తున్నానని, రాష్ట్ర పరిపాలన ఇక్కడ నుంచే చేపడతానని ఇటీవల భోగాపురం ఎయిర్ పోర్టు శంకుస్థాపన చేసేందుకు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి జగన్ చెప్పిన సంగతి తెలిసిందే. ఈ ప్రకారం విశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసేదిశగా పలుమార్లు నగరానికి రానున్నట్లు తెలుస్తోంది. హనుమంతవాక వద్ద ఫ్లై ఓవర్‌కు సైతం త్వరలో శంకుస్థాపన చేస్తారని వైసిపి శ్రేణులు చెబుతున్నాయి. ఆర్‌కె.బీచ్‌లో ఉండే పలు సౌకర్యాలను సాగర్‌నగర్ వైఎస్ఆర్ వ్యూ పాయింట్ పేర కల్పించడంతో ఈ వ్యూ పాయింట్ ప్రజల ఆదరణను పొందుతోంది. రుషికొండ వరకూ సాగర తీరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దే ప్రణాళికలు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నట్లు తెలుస్తోంది.

క్లాప్ డ్రైవర్ల భిక్షాటన

చెల్లించకుండా కేవలం రూ.12,500 మాత్రమే కాంట్రాక్టర్ చెల్లిస్తున్నారని, ఇది అన్యాయం అన్నారు. అవినీతిని సహించనన్న సిఎం మాట నిలుపుకోవాలన్నారు. కటింగులు పోగా రూ.10 వేలు వస్తే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని యూనియన్ నాయకుడు పి.అనీల్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు మాట్లాడుతూ, కార్మిక సమస్యలు చెప్పుకోడానికి ముఖ్యమంత్రి ఇంటర్వ్యూ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.రమణ, నాయుడు, అప్పారావు, సురేష్, అప్పన్న, అభి, సుధాకర్, రామకృష్ణ ప్రసంగించారు.

విశాఖలో నాగ చైతన్య సందడి

మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో నాగ చైతన్య చిత్ర విశేషాలను మీడియాకు వివరించారు. ఈ సినిమాకి ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా తనయుడు యువన్ శంకర్ రాజాతో కలిసి సంగీతం అందించడం విశేషం అన్నారు. వైజాగ్‌లో తీసిన తన ప్రతి సినిమా హిట్ అవుతుందని నమ్మకంగా చెప్పారు. అరవింద్ స్వామి, శరత్ కుమార్, ప్రియ మణి వంటి సీనియర్ నటులు ఇందులో నటించారని తెలిపారు. సినిమాలో ప్రతి పది నిమిషాలకు ట్విస్ట్‌లు ఉంటాయన్నారు. నిర్మాతలు శ్రీనివాస్, పవన్ కుమార్ ఎంతో సపోర్ట్ చేసి సినిమా తీశారని ధన్య వాదాలు తెలిపారు. అనంతరం మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ, కస్టడీ సినిమాను శివ సినిమాతో పోల్చవద్దు అని కోరారు. దర్శకుడు వెంకట్ ప్రభు చెప్పిన కథ మొదటి సిటింగ్‌లోనే బాగా నచ్చిందన్నారు. హీరోగా అన్ని జోనర్ సినిమాలు చేస్తానన్నారు. ఈ సినిమా తమిళ ప్రేక్షకులను కూడా అలరిస్తుందని తెలిపారు. మంచి కథ కుదిరితే అఖిల్‌తో సినిమా చేయాలని ఉందన్నారు.



దీక్షలో కూర్చున్న హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్మికులు

769వ రోజుకు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 769వ రోజుకు చేరాయి. ఈ రోజు దీక్షల్లో హెచ్‌పిసిఎల్‌లోని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కార్మికులు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరావు, పి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల నాటకం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ, ఎంవిపి.కాలనీ : గాన గాంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన 'ఘంటసాల నాటకం' పోస్టర్‌ను మేయర్ గొలగాని హరి వెంకట కుమారి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రంగసాయి నాటక గ్రంథాలయం శాశ్వత నిధులు సమీకరణ కోసం నిర్వహిస్తున్న ఘంటసాల నాటకం ప్రతి ఒక్కరూ చూడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 28న సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో రెండు ప్రదర్శనలుగా ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి తెలిపారు. గ్రంథాలయ అవసరాల నిమిత్తం నిధులు సమకరించే క్రమంలో ప్రముఖ నేపథ్య గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవిత చరిత్ర నాటకాన్ని ఏర్పాటు చేశామన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన శ్రీ సాయి సంతోషి నాట్యమండలి సురభి కళాకారులు ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. గోడపత్రిక ఆవిష్కరణలో సీనియర్ జర్నలిస్ట్ ఎన్ఎన్ఆర్, రంగసాయి నాటక గ్రంథాలయం గ్రంథ పాలకులు జమ్మా చిన్నబాబు పాల్గొన్నారు.

బిజెపి ఎంపీని అరెస్ట్ చేయాలి

పౌర, ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని, రెజ్లర్ల డిమాండ్లు పరిష్కరించాలని, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న ప్రజల పోరాటానికి సంఘీభావంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బుధవారం పౌర, ప్రజాసంఘాల వేదిక ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పౌర ప్రజా సంఘాల వేదిక సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్, పిఒడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, మానవ హక్కుల వేదిక తెలంగాణ, ఎపి రాష్ట్రాల కన్వీనర్ విఎస్.కృష్ణ, ఐఎఫ్‌టియు జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు కె.మల్లయ్య, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు ఎమ్‌డి బేగం, డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి.మధు, పిఒడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు పి.రోహిణి, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్, డిహెచ్ పిఎస్ నగర ప్రధాన కార్యదర్శి గుడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖలో గురువారం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముందుగా సీ- హారియర్ మ్యూజియం పనులను పరిశీలించి ఏర్పాట్లపై విఎంఆర్‌డిఎ అధికారులకు పలు సూచనలు చేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు

12 నుంచి విజయవాడలో శ్రీలక్ష్మి మహాయజ్ఞం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు అష్టోత్తర శత కుండాత్మక (108) చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞం నిర్వహిస్తున్నట్లు దేవదాయ ధర్మాదాయ శాఖ విశాఖపట్నం జిల్లా సహాయ కమిషనర్, శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఎగ్జిక్యూట్ ఆఫీసర్ కె.శిరీష తెలిపారు. బుధవారం దేవస్థానంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు యజ్ఞ దీక్షను తీసుకుంటున్నట్లు చెప్పారు. 12న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శ్రీ లక్ష్మీ మహా యజ్ఞాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఆ రోజు సాయంత్రం 7.30 నుంచి 9గంటల వరకు విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణం,13న ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణం, 14న అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి కల్యాణం, 15న శ్రీశైల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి లీలా కల్యాణం, 16న సింహాచల శ్రీ వరహాలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 17న ఉదయం 9 గంటల నుంచి పారాయణాలు, 108 కుడములతో హోమాలు, మహా పూర్ణాహుతి జరుగుతుందన్నారు. ఈ మహా పూర్ణాహుతిలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, విశాఖపట్నం శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మా నందేంద్ర సరస్వతి పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ మహా యజ్ఞం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్త సుబ్రహ్మణ్యం ఎఇలు వెంపలి రాంబాబు, తిరుమలేశ్వరరావు, సహాయ ఇంజినీర్ కె.సూర్యనారాయణమూర్తి, వేదపండితులు ఘనాపాటి, గణపతి పంచముఖి శర్మ, అర్చకులు బృందావనం శేషు తదితరులు



వివరాలు వెల్లడిస్తున్న శిరీష

21న అస్త్ర ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ పరీక్ష

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : సివిల్ సర్వీస్ ఆశావహులను ఎంపిక చేయడానికి ఈ నెల 21న ఆన్‌లైన్ పోటీ పరీక్ష నిర్వహించనున్నట్టు హైదరాబాద్‌కు చెందిన ఎనలాగ్ ఐఎఎస్ అకాడమీ వ్యవస్థాపక సంచాలకులు శ్రీకాంత్ విన్నకోట తెలిపారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి అగ్రగణ్యులుగా నిలిచినవారికి 100 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. అస్త్ర పరీక్ష ద్వారా ఉత్తమ సివిల్ సర్వెంట్లను తీర్చిదిద్దే లక్ష్యంతో ఎపి, తెలంగాణ రాష్ట్రాలలోని 67 జిల్లాలలో అత్యధిక శాతం మార్కులు సాధించి తొలి మూడు స్థానాలలో నిలిచేవారికి 80, 60, 50 శాతం రాయితీలతో ఉపకార వేతనాలుంటాయని తెలిపారు. రెండు గంటల నిడివిలో 100 మార్కులకు ఈ పోటీ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్ష రాయదలచినవారు ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదని తెలిపారు. www.analogeducation.in లో లాగిన్ అయ్యి దరఖాస్తు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తిచేయడంలో సమస్య ఎదురైతే ఎనలాగ్ సంస్థ సహాయకులను 84949 90066 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైనవారు మాత్రమే కాకుండా డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాలు చదివే సివిల్స్ ఆశావహులు కూడా ఈ ఆన్ లైన్ పరీక్షల ద్వారా లాంగ్ టర్మ్ ట్యూషన్ ఫీజులో భారీ రాయితీ పొందే అవకాశం ఉంటుందన్నారు.

రహదారి భద్రత పాటిద్దాం : జెవి.రత్నం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : రహదారి భద్రతా ప్రమాణాలు పాటిద్దాం ప్రమాదాలు నివారిద్దాం అని గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం అన్నారు. ఎంవిపి కాలనీలో బుధవారం ఉదయం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నపిల్లలు వాహనాలు నడపరాదన్నారు. ఉపాధ్యాయిని నీలిమ మాట్లాడుతూ, ట్రాఫిక్ భద్రతా ప్రమాణాలు మీద అందరికీ అవగాహన కల్పించడం చాలా అవసరం అన్నారు. సిఎస్‌కె ఎన్జీవో అధ్యక్షుడు జి.ధర్మారావు మాట్లాడుతూ విశాఖ నగరంలో రహదారి ప్రమాదాలు పెరుగుతున్నాయని, నివారణకు యువత నడుంబిగించాలని పిలుపునిచ్చారు.



35వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న శ్రీభరత్

రాష్ట్రం దివాళా : శ్రీభరత్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి నాలుగు సంవత్సరాల పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందని, ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలూ జరగలేదని టిడిపి విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త ఎం.శ్రీభరత్ ఆరోపించారు. మీకోసం మీ భరత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం 35వ వార్డులో ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ గుడి నుంచి ప్రారంభమైన పాదయాత్ర ప్రసాద్ గార్డెన్స్ పండా వీధి ప్రాంతాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం బాగుపడాలంటే సైకో జగన్మోహన్‌రెడ్డి పాలన పోవాలని, తిరిగి సైకిల్ పాలన రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జి, 34వ వార్డు అధ్యక్షుడు బుచ్చా రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ పిల్లలకు ఉచిత ప్రవేశాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన శారీరక, బధిర పురుష వికలాంగుల కోసం పెందుర్తి, పెదవాల్తేరు, విశాఖపట్నంలోని వసతి గృహాల్లో 2023-24 విద్యా సంవత్సరంలో 1వ తరగతి నుండి డిగ్రీ వరకు చదువుతున్న వికలాంగ విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు రెడ్డన్న ప్రతిభా వంతులు హిజ్రాలు వయోవద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. పెదవాల్తేరు వసతి గృహంలో 62 ఖాళీలు, పెందుర్తి వసతి గృహంలో 60 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి కల వికలాంగ పురుష విద్యార్థులు వైద్య ధ్రువపత్రం, టీసీ, ఆధార్, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రము, రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలతో వసతి గృహ వార్డెన్‌లను సంప్రదించాలని కోరారు. వివరాలకు విశాఖపట్నం వసతి గృహ వార్డెన్ (94414 66347), పెందుర్తి వసతి గృహ వార్డెన్ (95054 94632) సంప్రదించాలని సూచించారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈనెల 12న శుక్రవారం విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని మూడో జోన్ ఆపరేషన్స్ డిఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని సంబంధిత ఫీడర్‌లో నిర్వహణ పనుల దృష్ట్యా కొమ్మాది జంక్షన్, శ్రీనివాస్ నగర్, సాయిరామ్ కాలనీ, జిసిసి లేఅవుట్, టీచర్స్ లేఅవుట్, అన్నంరాజు నగర్, డిఆర్‌కె రాజు లేఅవుట్, రిక్షా కాలనీ, ప్రశాంతి నగర్, దేవిమెట్ట గ్రామం, ఓజోన్ వ్యాలీ రోడ్, ఓజోన్ వ్యాలీ బ్లాక్స్, జనచైతన్య లేఅవుట్, కె1, కె2, కె3 కాలనీలు, నవోదయ పాఠశాల ప్రాంతం, బక్కన్నపాలెం, ఎన్‌టిఆర్ కాలనీ, లచ్చిరాజు లేఅవుట్, కొమ్మాది గ్రామం, సేవానగర్, దేవి మెట్ట, సూర్యాపేపర్, ఎస్‌టిబిఎల్ వైభవ్ నగర్‌ఎయు టీచర్స్ లేఅవుట్, కొమ్మాది, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రజా మరుగుదొడ్లు ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : బీచ్ రోడ్‌లోని వైఎంసిఎ వద్ద రూ.19.86 లక్షలతో ఆధునికీకరించిన ప్రజా మరుగుదొడ్లను జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ఇతర అధికారులతో కలిసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర పరిశుభ్రతకు సందర్శకులు, పర్యాటకులు ప్రజా మరుగుదొడ్లను ఉపయోగించాలని కోరారు. బీచ్ రోడ్లో వ్యర్థాలు వేయరాదని, పెంపుడు కుక్కలను రోడ్లపై మలమూత్రాలు వేయకుండా చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సోలార్ దీపాలు, ఫ్యాన్లు అందజేత

ప్రజాశక్తి- సీతమ్మధార : 45వ వార్డు చెంచలయ్య కాలనీలో 48 మంది కుటుంబాలకు హ్యాబిటాట్ ఫర్ హ్యూమనిటీ ఇండియా, ఆప్టిమాస్ సంస్థల సంయుక్త సహకారంతో సోలార్ దీపాలు, ఫ్యాన్లు ఉచితంగా అందజేశారు. ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు మాట్లాడుతూ, సోలార్ దీపాలు, ఫ్యాన్లు వినియోగంతో కరెంట్ ఆదా చేయొచ్చన్నారు. వార్డు కార్పొరేటర్ కంపా హనోక్, వార్డు అధ్యక్షులు పైడి రమణ, యుసిడి పీడీ పాపునాయుడు, జెడ్‌సి ఆర్‌జివి.కృష్ణ, చైతన్య, రవిభాస్కర్, సతీష్, రవినారాయణ, పి.రాజు, ఎ.యాకోబు, కె.బాక్కయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : జివిఎంసి 31వ వార్డు పరిది చాకలిపేట, లక్ష్మి వీధి, గొల్లలపాలెం పరిధిలో సుమారు రూ.40 లక్షల వ్యయంతో బిటి రోడ్డు, సిసి కాలువ, నడక వంతెన నిర్మాణాలకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, వార్డు కార్పొరేటర్ బిపిన్ జైన్‌తో కలిసి మేయర్ గొలగాని హరివెంకటకుమారి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, 4వ జోన్ పరిధిలో తాగునీరు, వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి పనులు చేపడుతున్నామన్నారు.

సీతమ్మధార: 46వ వార్డు లక్ష్మినారాయణపురం-1లో రూ.38 లక్షలతో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు, రూ19లక్షలతో గెడ్డ రక్షణగోడ నిర్మాణ పనులకు వార్డు కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ, ఇప్పటికే వార్డు పరిధిలో రూ.9కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వారం రోజుల్లో మరో రూ.మూడు కోట్లతో మరికొన్ని అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని, ఇంకొన్ని పనులు టెండరింగ్ దశలో ఉన్నాయన్నారు.కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, నాయకులు కె చిన్న, కె రామారావు, దూది నరసింగరావు, కె లావణ్య, సుజాత, సీతయ్య, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్

మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి- సీతమ్మధార : 45వ వార్డు సంతోషిమాత వాంబే కాలనీవాసులకు ఇళ్లపట్టాలు ఇప్పించి, కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన కెకె.రాజు భరోసానిచ్చారు. బుధవారం ఆ వార్డు కార్పొరేటర్ కంపా హనోక్ ఆధ్వర్యంలో యుసిడి, హౌసింగ్, ఇతర జివిఎంసి అధికారులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, కాలనీలో దశాబ్దకాలంగా 78కుటుంబాలు నివాసమంటున్నాయని, వీరికి ఇళ్ల పట్టాలు, విద్యుత్ కనెక్షన్లు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తామన్నారు.

కంచరపాలెం: 49వ వార్డు బర్మాక్యాంపు కాలనీలో అధికారులతో కలిసి, వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు సమావేశం నిర్వహించారు. ఎఎస్‌ఆర్ నగర్ డి-బ్లాక్ పెండింగ్‌లో ఉన్న పట్టాలు, రైల్వే సొసైటీలో రోడ్లు, డ్రైనేజీలు, ఇళ్లనిర్మాణాలను ఇతర సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు.



గ్రామసభలో సమస్యలు నమోదు చేస్తున్న కెకె.రాజు

కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటూమూరి సతీష్, సీతమ్మదార తహశీల్దార్ శ్యామ్, గోపాలపట్నం తహశీల్దార్ జయ, యుసిడి పీడీ పాపునాయుడు, ఐదో జోన్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, హౌసింగ్ ఇఇ ప్రసంగరాజు, వైసిపి వార్డు అధ్యక్షులు పైడి రమణ, నీలి రవి, గోపి . 49వ వార్డు నేతలు కర్రి రామారెడ్డి, ఎస్.చంద్రశేఖర్, బి.శివరాంప్రసాద్, బి. రాము, బి.శంకర్, పి. రవికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని రేవిడి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 213/6పి, .214/1, 216/1లలో సుమారు 5.36 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని, రెవెన్యూ రికార్డుల్లోనూ నమోదు చేయించుకుని క్రయవిక్రయాలను సిద్ధమౌతున్నారని ఆ గ్రామానికి చెందిన రైతులు బుధవారం తహశీల్దార్ తోట శ్రీవల్లికి ఫిర్యాదు చేశారు. పొలానికి కాలువగా ఉన్న ఈ భూమి రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా ఉన్నప్పటికీ, రెవెన్యూ అధికారుల అండదండలతో, స్థానిక నేతల ప్రోద్బలంతో పట్టాదారు పాసుపుస్తకాల్లోనూ, '1బి' రికార్డుల్లో కొంతమంది వ్యక్తులు నమోదు చేయించుకుని క్రయవిక్రయాలను ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారితోపాటు వారికి సహకరించిన అధికారులు, నేతలపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని వేడుకున్నారు.ఈ మేరకు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన వారిలో రేవిడి రైతులు ఎం.అప్పారావు, రెడ్డి చిన్నారావు, ఆర్ఎస్.నాయుడు, రెడ్డి రామారావు, తదితరులున్నారు.



తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రేవిడి రైతులు

బంగారం కోసమే దారుణం?

- మహిళను హత్య చేసిన నిందితుడు
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన
- పోలీసుల అదుపులో ఆటోడ్రైవర్



హత్యకు గురైన మహిళ గోపి (ఫైల్‌ఫొటో)



నిందితుడు ఆటో డ్రైవర్ రాజు

ప్రజాశక్తి -భీమునిపట్నం : వివాహిత హత్య కేసులో ఆటోడ్రైవరే నిందితుడిగా పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మహిళ వద్ద నున్న బంగారం కాజేయడానికి హత్యకు పాల్పడి ఉండవచ్చుని అనుమానిస్తున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించిన వివరాలు, కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం...

జివిఎంసి ఒకటోవార్డు తగరపువలస, బాలాజీనగర్, యాతపేటకు చెందిన రీసు గోపి (30) అనే వివాహిత ఈ నెల ఒకటో తేదీన హత్యకు గురైంది. నాల్గో వార్డు చేపలుప్పాడ, పాతూరుకు చెందిన ఆటో డ్రైవర్ మైలపల్లి రాజు హత్య చేసి, గంభీరం గెడ్డలో మృతదేహాన్ని పడేశాడని అనుమానిస్తున్నారు.

ఈనెల 1న చిప్పాడ పంచాయతీ ఆశిపాలెంలో బంధువులు ఇంట్లో మేనల్లుడి పెళ్లిచూపులు కార్యక్రమానికి వెళ్లిన గోపి, తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె అక్క రాము 2న పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహిళ అదృశ్యంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు గంభీరంలో శవమై తేలడంతో హత్య కేసుగా మార్పుచేసి విచారణ కొనసాగించారు. సిఐ కె లక్ష్మణమూర్తి, ఎస్ఐ హరీష్ ఆధ్వర్యంలో పోలీసులు గంభీరంగెడ్డలోని మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టానికి కేజిహెకు తరలించారు. సిఐ కె లక్ష్మణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొబైల్ కాల్‌డేటా ఆధారంగా విచారణ

హత్యకు గురైన మహిళ గోపి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు, హత్యకు ముందు చివరగా ఎవరితో మాట్లాడినదీ వివరాలు సేకరించారు. చేపలుప్పాడ, పాతూరుకు చెందిన ఆటో డ్రైవర్ రాజుతో మాట్లాడినట్టు గుర్తించి, ఆ దిశలో విచారణ వేగవంతం చేశారు. మంగళవారం రాత్రి నిందితుడు రాజును మంగమారిపేట వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బంగారం కోసమే హత్య?

బంధువుల ఇంట పెళ్లిచూపులకు వెళ్లిన హతురాలు గోపి, తన వద్దనున్న సుమారు పదితులాల బంగారు ఆభరణాలను అలంకరించుకుని వెళ్లింది. అప్పటికే ఆమెతో పరిచయం ఉన్న ఆటోడ్రైవర్ రాజు, అదేరోజు సాయంత్రం ఆమెను ఆశిపాలెం రమ్మని ఫోన్‌చేశాడు. అక్కడి నుంచి ఆటోలో నేరుగా చేపలుప్పాడ, గంభీరంగెడ్డ వరకు వెళ్లిన నేపథ్యంలో గోపి వద్దనున్న బంగారాన్ని కాజేసేందుకు ఆటోడ్రైవర్ రాజు ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. కాగా హతురాలు గోపితో నిందితుడు ఆటోడ్రైవర్ రాజుకు ఎటువంటి సంబంధాలు లేవని ఆమె కుటుంబీకులు అంటున్నారు. హత్యకు గురైన గోపికి వివాహంకాగా, ఏడేళ్ల క్రితం విడాకులు తీసుకుని బాలాజీ నగర్‌లో ఉంటోంది.



సంఘటనాస్థలిని పరిశీలిస్తున్న సిఐ లక్ష్మణమూర్తి

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి- సింహాచలం: గోశాల ప్రధానకూడలి వద్ద బిఆర్‌టిఎస్ రహదారిలో టాటా మోటార్స్ కారు అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అటుగా ఎటువంటి వాహనాలు రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.ఈ ప్రమాదంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, సంబంధిత పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు

సిఐపై సిపికి ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : తన ఇంటి రహదారి సమస్యపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పరిష్కారంలో జాప్యం చేయడమే కాకుండా, ఇదేమిటని ప్రశ్నించినందుకు తనపై గ్రామంలో ప్రజలందరి సమక్షంలో సిఐ ఎస్.సన్యాసినాయుడు చేయిచేసుకున్నారని మండలంలోని నేరేళ్లవలస పంచాయతీకి చెందిన సీనియర్ టిడిపి నేత నేరేళ్ల సూర్యనారాయణ ఆవేదన చెందుతున్నాడు. ఈ మేరకు తనకు న్యాయం చేయడంతోపాటు, తనను కొట్టిన సిఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గతనెల 14న తన ఇంటి ముందు రాకపోకల విషయమై తన తమ్ముడు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు చేయగా, ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. దీనిపై అడిగినందుకు సిఐ కొట్టారన్నారు. కాగా సమస్య పరిష్కరించాల్సిన పోలీసులే ఫిర్యాదుదారుపై చేయిచేసుకోవడం దుర్మార్గమని, బాధితుడికి న్యాయం జరగకుంటే పోలీసుస్టేషన్ వద్ద ధర్నా చేస్తామనిమండల టిడిపి అధ్యక్షుడు కోరాడ రమణ అంటున్నాడు.

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యాన నేటి నుంచి మొక్కజొన్న కొనుగోలు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో గురువారం నుంచి మొక్కజొన్న కొనుగోలు చేపట్టనున్నట్లు మార్క్‌ఫెడ్ మేనేజర్ కె.రమేష్ వెల్లడించారు. బుధవారం మండల కాంప్లెక్స్‌లోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రస్తుత రబీ సీజన్‌లో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు మొక్కజొన్న సాగుచేస్తున్నారన్నారు. అయితే పండించిన మొక్కజొన్న అమ్మకానికి ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో గురువారం నుంచి కృష్ణాపురం, పాండ్రంగి, బాందేవపురం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను గురువారం నుంచి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులు తాము పండించిన మొక్కజొన్నకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి విక్రయించ వచ్చని సూచించారు. క్వింటా మొక్కజొన్నను ప్రభుత్వ ప్రకటించిన మద్దతుధర రూ.1962కు కొనుగోలు చేస్తామన్నారు. మొక్కజొన్నలో 14 శాతం తేమ, ఇతర నిబంధనలు వర్తించేలా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి.వెంకటాచలం, డిపిఎం, వైదేహి, సిసిలు పద్మ, రమణ, లక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిపిఐ నేతలు

సిపిఐ నేత గున్నారావుకు ఘననివాళి

ప్రజాశక్తి -తగరపువలస : సిపిఐ నేత తెడ్లాపు గున్నారావు ద్వితీయ వర్ధంతి స్థానిక జిఆర్.భవన్‌లో బుధవారం నిర్వహించారు. గున్నారావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నవభారత్ అసోసియేషన్ అధ్యక్షులు సుంకర రాంప్రసాద్ మాట్లాడుతూ, గున్నారావు బహుముఖ ప్రజ్ఞాశాలిఅన్నారు. పార్టీ సీనియర్ నాయకులు అల్లు బాబూరావు మాట్లాడుతూ, పార్టీ, ప్రజాసంఘాల అభివృద్ధికి గున్నారావు ఎంతగానో కృషి చేశారన్నారు. వ్యవసాయ, కల్లు గీత కార్మికుల సమస్యలపై పనిచేశారని గుర్తుచేశారు. సభలో చిట్టివలస లేబర్ యూనియన్ నాయకులు కొండపు ఈశ్వరరావు, నవ చైతన్య కళా నాట్య మండలి అధ్యక్షులు సరగడం చిన్నరెడ్డి, పార్టీ నాయకులు కె రాంబాబు, సిహెచ్ అప్పలసూరి, ఎం వీర్రాజు, టి సోమరాజు పాల్గొన్నారు

'జగనన్నకు చెబుదాం' ఎన్నికల స్టంట్!

తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షులు అనిత



ప్రసాదం స్వీకరిస్తున్న అనిత

ప్రజాశక్తి- సింహాచలం: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఎన్నికల స్టంట్ మాత్రమేనని, దాని వల్ల ప్రజలకు ఒనగూరే ప్రయోజనమేమీ లేదని తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు. బుధవారం సింహాద్రి అప్పన్నను కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జగన్‌కు నిజంగా ప్రజా సమస్యలను విని, వాటిని పరిష్కరించాలనే చిత్తశుద్ధి ఉంటే, పరదాల మాటున కాకుండా నేరుగా ప్రజల్లోకి వస్తే సమస్యలు తెలుస్తాయన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, జగనన్న అదీ, జగనన్న ఇదీ అంటూ పనికిమాలిన కార్యక్రమాలను ప్రవేశపెడితే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేనన్నారు. జగనన్నకి చెబుదాం టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే అది పనిచేయడం లేదన్నారు.


12న హెచ్‌సిఎల్ జాబ్ డ్రైవ్

ప్రజాశక్తి -కంచరపాలెం : జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12న నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో హెచ్‌సియల్-టెక్‌బితో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తునట్లు జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ ప్రతినిది సాయికృష్ణ చైతన్య తెలిపారు. 2022 -23లో ఇంటర్మీడియట్ పూర్తి చేసి. కనీసం 60శాతం మార్కులతో ఉత్తీర్ణులైన యువతీయువకులు ఈ జాబ్ డ్రైవ్‌కు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 12వ తేదీన నరవలో విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9848438254 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

రేపు బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి- పిఎం పాలెం : ఈనెల 16 నుంచి 19 వరకు జరగబోయే ఆంధ్రప్రదేశ్ యూత్ అంతర్ జిల్లా బాస్కెట్ బాల్‌పోటీలకు విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక ఈ నెల 13న చేయనున్నారు. విశాఖపట్నం బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్వర్యంలో జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ శుక్రవారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగనున్నాయి. 2007 జనవరి ఒకటి తర్వాత పుట్టిన వారే ఈ ఎంపికలకు అర్హులుగా పరిగణింపబడతారని, క్రీడాకారులు ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేట్ తప్పని సరిగా తీసుకురావాలనీ విశాఖ జిల్లా బాస్కెట్ బాల్ అషోషియేషన్ అధ్యక్షులు సునీల్ మహంతి, సెక్రెటరీ జి భూషణరావు తెలిపారు. ఇతర వివరాలకు 8919649048, 9966753209 మొబైల్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు, పౌర సేవలు అందించడమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తోందఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు అన్నారు. బుధవారం 43వ వార్డు అక్కయ్య పాలెం-1. గొల్లలపాలెం, మునసబువారి వీధి తదితర ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ ఉషశ్రీతో కలిసి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను వివరిస్తూ, ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పర్యటించారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ రాయుడు శ్రీను, యువజన విభాగం ఇంచార్జ్ ఎం.సునీల్, ఎయిర్‌పోర్టు అథారిటీ సభ్యుడు అంబటి శైలేష్, వార్డు నేతలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మొక్కుబడి.. చలివేంద్రాలు..

- నీరూ లేదు.. ఇచ్చేవారూ లేరు..
- అనేక చోట్ల అపరిశుభ్రతకు నెలవు
- జివిఎంసి నిర్వాకంపై పెదవివిరుపు
- ప్రజాధనం దుర్వినియోగంపై విమర్శలు



పాత ఆంధ్రా బ్యాంక్ దగ్గర్లో దిక్కూమొక్కూ లేని చలివేంద్రం

ప్రజాశక్తి -భీమునిపట్నం : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు జివిఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలు దిష్టిబొమ్మల్లా ఉన్నాయే తప్ప, ప్రజల గొంతు తడిపే దిక్కు లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చలివేంద్రాల ఏర్పాటు, నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల ప్రజాధనం దుర్వినియోగమే తప్ప ఎటువంటి ప్రయోజనం లేదని పలువురు పెదవి విరుస్తున్నారు. కాంట్రాక్టర్ల జేబులు నింపడమే లక్ష్యంగా వీటిని ఏర్పాటు చేశారనే విమర్శలున్నాయి. వివరాల్లోకి వెళితే...

జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోని నాలుగు వార్డుల్లో మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు జివిఎంసి ఆధ్వర్యంలో 14 చలి వేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒకటి, నాలుగు వార్డుల్లో మూడేసి, రెండు, మూడు వార్డుల్లో నాలుగేసి చలివేంద్రాలను ఏర్పాటు చేసినా ప్రయోజనం లేని పరిస్థితి ఉంది. 'పర్యావరణ హిత చలివేంద్రం' పేరిట తాటాకు కమ్మలతో షెడ్‌ను కట్టి, నీటి కోసం ప్లాస్టిక్ డ్రమ్ము, రెండు కుండలు, నాలుగైదు గ్లాసులు ఏర్పాటు చేసినా, అదంతా మొక్కుబడి తంతే తప్ప అక్కడ నీరుగానీ, నీరిచ్చే నాధులుగానీ లేని పరిస్థితి ఉందని పలు చలివేంద్రాలను పరిశీలిస్తే స్పష్టమౌతోంది.

అనేక చోట్ల నీరిచ్చే దిక్కులేదు...

తగరపువలస , భీమిలి రోడ్డులో గతంలో ఉన్న ఆంధ్రాబ్యాంక్ ఉండే ప్రాంతంలో ఉన్న చలి వేంద్రం వద్ద, వెంకటేశ్వర మెట్ట హైవే బస్టాప్ వద్ద ఏర్పాటు చేసే చలివేంద్రాల వద్దనీరిచ్చే వ్యక్తులే లేదున. చలి వేంద్రాల ఏర్పాటు, వాటి నిర్వహణ తీరుపై మంగళ, బుధవారాలు వరుసగా ప్రజాశక్తి జరిపిన పరిశీలనలో వెల్లడైంది.

ఒక్కో చలివేంద్రం నిర్వహణకు, అక్కడ నీరిచ్చేందుకు ఒక వ్యక్తిని నియమించి, రోజుకు రూ.450లు చొప్పున కాంట్రాక్టర్‌కు జివిఎంసి ఇవ్వనుంది. అయితే అనేక చోట్ల చలి వేంద్రాల వద్ద నీరిచ్చే మనుషులే కానరావడం లేదు. అంటే ఆయా చలివేంద్రాల వద్దకూడా మనుష్యులను నియమించినట్టుగా చూపించి డబ్బులు కాజేసే ప్రయత్నమేనని ఆరోపణలు వినబడుతున్నాయి. చలివేంద్రాల ఏర్పాటు, నిర్వహణ మాటున లక్షలాది ప్రజాధనం కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకు దీన్ని ఏర్పాటు చేసినట్లు కనిపిస్తుందే తప్ప, ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదని ఆరోపణలున్నాయి. భీమిలి .జోన్‌లో అనేక చలివేంద్రాల వద్ద క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ విషయం స్పష్టంగా కనిపిస్తోంది.



తగరపువలస వెంకటేశ్వర మెట్ట వద్ద చలి వేంద్రం

ప్రజాధనం...కాంట్రాక్టర్ల పరం?

లేనిపోని పన్నులు వేసి ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్న జివిఎంసి యంత్రాంగం, అలా పోగేసిన ప్రజాధనాన్ని ఇలా కొద్దిమంది కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చే విధంగా కార్యక్రమాలను నిర్వహించడంపై స్థానికులు మండి పడుతున్నారు. జి - 20 సదస్సు సందర్భంగా సుందరీకరణ, అభివృద్ధి పనుల్లోనూ ఇదే కనిపించిందని అంటున్నారు. అప్పట్లో చేసిన అనేక పనుల్లో నాణ్యత కొరవడగా, కొన్ని పనులను అరకొరగా వదిలేసి, మంజూరైన నిధులను పారదర్శకంగా వెచ్చించకుండా కైంకర్యం చేశారనే ఆరోపణలున్నాయి. ఇపుడు చలివేంద్రాల నిర్వహణలో అటువంటినిర్లక్ష్యమే కనిపించడంపై పలువురు మండిపడుతున్నారు.

చలివేంద్రాల నిర్వహణపై వివరణ కోసం స్థానిక జెడ్‌సి రామును ఫోన్ ద్వారా ప్రజాశక్తి సంప్రదించగా, వాటి నిర్వహణ ఇంజనీరింగ్ విభాగం ఎఇ చూస్తారని, అతడినే అడిగితే అన్ని వివరాలు తెలుస్తాయని బదులిచ్చారు. సంబంధిత ఎఇ సుమన్ వివరణ కోరే ప్రయత్నం చేయగా, ఆయన ఫోన్ ఎత్తలేదు.

పెన్షనర్ల సమస్య పరిష్కారానికి పోస్ట్ కార్డు ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్నాను నూకరాజు

ప్రజాశక్తి -ములగాడ : ఎఐసిసి పిలుపుమేరకు ఇపిఎఫ్ 95 పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రధానమంత్రికి రాసే పోస్ట్‌కార్డు ఉద్యమంలో సంఘ సభ్యులంతా పాల్గొని జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ కె హుస్సేన్, జోన్ కార్యదర్శి కె.నూకరాజు పిలుపునిచ్చారు. బుధవారం సిఐటియు వెంకన్నపాలెం మల్కాపురం కార్యాలయంలో సిహెచ్ తమ్మారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాబోయేది ఎన్నికల సంవత్సరం కావడంతో పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రధానిపై ఒత్తిడి తెచ్చేలా ఉద్యమం తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇపిఎఫ్ కార్యాలయం నుంచి వెలువడిన నోట్ ఆధారంగా మినిమం వెయ్యి రూపాయల పెన్షన్‌కే బడ్జెట్‌లో రూ.వెయ్యికోట్లు కేటాయించారని, అంతకుమించి పెన్షన్ పెంపునకు అవకాశం లేదని కేంద్ర ఆర్థికమంత్రి వెల్లడించినట్లు తెలిపారు. కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా 1.16శాతం నిధిని ప్రభుత్వానికి బదులుగా, యాజమాన్యాల కంట్రిబ్యూషన్ నుంచి మినహాయించడం అన్యాయమన్నారు. 2014 సెప్టెంబర్ ఒకటో తేదీకి ముందు రిటైరైన వారికి పెన్షన్‌కు అవకాశం లేదని, దీనిపై ఐక్యపోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి శారద

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలో లోడగలవానిపాలెం పంచాయతీ ఈగలవానిపాలెంలో పాఠశాల భవన నిర్మాణానికి ఎంపిపి మజ్జి శారద ప్రియాంక బుధవారం శంకుస్థాపన చేశారు. పంచాయతీలో గడపగడపకు ప్రోగ్రాంలో భాగంగా పాఠశాల భవనం మంజూరు చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు స్థానికులు ఇదివరకే విన్నవించగా, ఆయన ఆదేశాల మేరకు మండల పరిషత్ జనరల్ నిధులు రూ.10 లక్షలను పాఠశాల భవననిర్మాణానికి కేటాయించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, ఎంపిపి శారద ప్రియాంక, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, లోడగలవానిపాలెం సర్పంచ్ లోడగల రాజేశ్వరి రమణ, ఎంపిటిసి రౌతు శ్యామల వెంకటరావు, కోఆపరేటివ్ బ్యాంక్ ప్రెసిడెంట్ పాండ్రంకి అప్పారావు, ఉప సర్పంచ్ ఈగల నాగరాజు, అధికారులు, సచివాల కన్వీనర్లు పాల్గొన్నారు.

13న సహస్ర చండీ పారాయణం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆర్‌కె.బీచ్ వేదికగా ఈ నెల 13వ తేదీన సహస్ర చండీ పారాయణం, హోమం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి అవసరాల ప్రసన్న కుమార్ తెలిపారు. అమృతానందనాధ సరస్వతి దివ్య ఆశీస్సులతో, శ్రీవేణిమాత పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొనే భక్తులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9160005430, 9440330246 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ చల్ల కృష్ణవీర్ అభిషేక్, మలేశ్వరరావు, సతీష్ తదితరుల పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ మహాయజ్ఞానికి ఆహ్వానం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : విజయవాడలోని గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే శ్రీ లక్ష్మీ మహా యజ్ఞానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారిని అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీష ఆహ్వానించారు. ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

ఫిర్యాదులపై మేయర్ తనిఖీ

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : "డయల్ యువర్ మేయర్" కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై 3వ జోన్ పరిధిలోని డిఆర్‌డిఎ ఆఫీస్ పరిసర ప్రాంతాలలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో పారిశుధ్యం నిర్వహణ, రోడ్ల అసంపూర్తి నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ సరిగాలేదని, అలసత్వం ప్రదర్శించరాదని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న రోడ్లను పరిశీలించి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను వివరాలడిగి తెలుసుకున్నారు. మిగిలిన రోడ్లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రశాంతంగా పాలీసెట్

అనకాపల్లి జిల్లాలో 95 శాతం మంది హాజరు





అనకాపల్లి డైట్ కాలేజీలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు, పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి వస్తున్న కలెక్టర్ రవి

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో బుధవారం జరిగిన పాలీసెట్-23 ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. అనకాపల్లిలో 16 కేంద్రాల్లో, నర్సీపట్నంలో 11 కేంద్రాల్లో, మొత్తం మొత్తం 27 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగినట్లు జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఐవిఎస్ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు 9,355 మంది దరఖాస్తు చేసుకోగా 8,840 మంది అంటే 94.5 శాతం మంది పరీక్షకు హాజరయ్యారని, వీరిలో బాలురు 5,217, బాలికలు 3,623 మంది ఉన్నారని వెల్లడించారు. పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రవి పఠాన్ పరిశీలించినట్టు ఆయన తెలిపారు.

కశింకోట : కశింకోట రాజీవ్ గాంధీ ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 250 మంది విద్యార్థులకు గాను 234 మంది హాజరైనట్లు పరీక్ష పర్యవేక్షణ అధికారిగా జి.మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శివ, జనరల్ హెడ్ ఎస్.గణేష్, ఆఫీస్ సూపరింటెండెంట్ కె.శివరాం, సిబ్బంది పాల్గొన్నారు.

భీమునిపట్నం : పాలిసెట్ -2023 పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, కెడార్ స్కూల్, ఎపి బాలికల గురుకుల పాఠశాల, ది సన్ స్కూల్ పరీక్షా కేంద్రాల్లో పాలిసెట్ ప్రవేశ పరీక్ష జరిగింది.



కశింకోట ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్‌లో పాలీసెట్ రాస్తున్న విద్యార్థులు

విజ్ఞానదాయకంగా వేసవి శిబిరాలు



చోడవరంలో డ్రాయింగ్ బేసిక్స్ చెబుతున్న గణేష్

శాఖ గ్రంథాలయాల ఆధ్వర్యాన ఆయా గ్రంథాలయాల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు విజ్ఞానదాయకంగా ఉంటున్నాయి. కథలు, పద్యాలు, పాటలు, చదరంగం, చిత్రలేఖనం, గణితం వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వడం, పోటీలు నిర్వహించడం చేస్తున్నారు.

ప్రజాశక్తి-చోడవరం

వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చోడవరం శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులు కథలు చదివి, గేయాలు ఆలపించారు. డ్రాయింగ్‌లో బేసిక్స్‌ను డి.గణేష్ నేర్పించారు. గణితంలో సూత్రాలను మేథ్స్ ఉపాధ్యాయుడు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జి.తిరుమల కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు కథలు, పాటలు, పుస్తక పఠనం, తెలుగు పదాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వై.వెంకటేశ్వర్లు, అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఆరిపాక కామేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.శిరీష, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

కోటవురట్ల : విద్యార్థులు పుస్తకాలు చదవడం ఎంత ముఖ్యమో కథలు చెప్పడం కూడా అంతే ముఖ్యమని వేసవి విజ్ఞాన శిబిరంలో శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్ తెలిపారు. బుధవారం పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం పలు కార్యక్రమాలు నిర్వహించారు. చదవడంతో పాటు కథలు చెప్పడం కూడా అలవాటు చేసుకున్నట్లయితే సమాజంలో వ్యక్తులతో ఎలా మాట్లాడాలో తేలికగా అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు, ఎల్.సతీష్ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : స్థానిక శాఖా గ్రంథాలయం లో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ పి అచ్చమ్మ విద్యార్థులతో దేశభక్తి గీతాలు పాడించారు. కథలు చదివించి వాటిలోని నీతిని తెలియపరిచారు. పివి కనకరాజు మాస్టారు కథలు, శ్లోకాలు విద్యార్థులకు నేర్పించారు.పిల్లలకు పొడుపు కథలు, క్విజ్ ప్రశ్నలు వేసి ఉత్సాహపరిచారు.జనవిజ్ఞాన వేదిక నాయకులు త్రిమూర్తులు రెడ్డి విద్యార్థులను ఉత్సాహ పరిచే విధంగా మైండ్ గేమ్ ఆడించారు. గ్రంథాలయధికారిని దమయంతి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో కథలు చెప్పించారు. కథల్లో నీతిని వివరించారు.విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం అలవాటును అలవర్చుకోవాలన్నారు. పుస్తక పఠనంతో మేధస్సు పెంపొందుతుందన్నారు .

గొలుగొండ: శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా గ్రంథాలయ అధికారి రాజబాబు ఆధ్వర్యంలో మూడవ రోజున బుక్ రీడింగ్, నీతి కథలు చెప్పే కార్యక్రమం నిర్వహించారు. లేమన్ అండ్ స్పూన్ ఆట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, సీఆర్పీ రామకృష్ణ, ఏఎన్ఎం లక్ష్మీ పాల్గొన్నారు.

పెందుర్తి : శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో మూడవరోజు బుధవారం వివిధ పాఠశాలల నుండి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. లైబ్రేరియన్ సూర్యకళ పర్యవేక్షణలో టీచర్ ఎం మహేశ్వరరావు కథలు రాయడం, కథలు చదవడం వంటి మంచి అలవాట్లను విద్యార్థులు అలవరచుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో కథలు చదివే కంటే, పుస్తకాల్లోని కథలు చదవడం మంచిదన్నారు. మాతృభాష గొప్పతనం తెలియజెప్పారు. డైట్ టీచర్ సబీనా యాస్మిన్ స్పీడ్ మాథ్స్, మరో డైట్ టీచర్ బషీరా కథలు రాయడంపైనా, డాన్స్ టీచర్ శార్వాణిదేవి కూచిపూడి నాట్యాన్ని విద్యార్థులకు నేర్పించారు

సింహాచలం : అడవివరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మూడో రోజు బుధవారం లైబ్రేరియన్ నర్సింహం ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తక పఠనం వలన విజ్ఞానంతో పాటు వినోదం ఆహ్లాదం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే ఎంతో ప్రయోజనమన్నారు. టీవీలు, సెలఫోన్లకు అతుక్కుపోయి ఆరోగ్యం పాడుచేసుకునే కంటే, పుస్తకపఠనంపై విద్యార్థులు ఆసక్తి చూపాలని సూచించారు.



సబ్బవరంలో చదరంగం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



వడ్డాదిలో పుస్తక పఠనం చేస్తున్న దృశ్యం



పెందుర్తిలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆశా యూనియన్ నాయకులు

సిఐటియు ఆధ్వర్యాన చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కసింకోట

మే డే మాసోత్సవాలు సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో మండలంలోని బుచ్చయ్యపేట గ్రామంలో ఆశా కార్యకర్తలు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ కోన నాయుడు బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి అక్కడికి హాజరైన వారందరికీ చల్లటి మజ్జిగను అందించారు. ఈ చలివేంద్రం ఈ నెలంతా కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎండలు విపరీతంగా ఉన్నాయని, ఇంటి నుంచి బయటకు కొద్ది దూరం వచ్చిన వెంటనే గొంతు ఎండిపోయే విధంగా వేడిగాలులు వీస్తున్నాయని, ఇటువంటి సమయంలో చలివేంద్రాలు ఉపశమనం కలిగిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గోవిందు, చిన్నమ్మలు, నాయుడు, లక్ష్మి, మంగ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- సబ్బవరం

ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం సెక్షన్ 12 (1) (సి)ను అనుసరించి 2023-2024 విద్యా సంవత్సరంలో ఐబి/ ఐసిఎస్ఈ/ సిబిఎస్ఈ /స్టేట్ సిలబస్ అమలు చేస్తున్న జిల్లాలోని అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం సీట్లలో 1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఎస్.అప్పలరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడతలో దరఖాస్తు చేసుకొనే ప్రక్రియ ఈ నెల 15 వరకు కల్పించినట్లు వెల్లడించారు. మండలంలోని విద్యార్థుల తలిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ పిల్లల వివరాలను ఆన్‌లైన్‌లో ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు http://cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారాగాని, టోల్ ఫ్రీ నెంబర్ 14417కుగాని సంప్రదించాలని కోరారు.

రికవరీ ఫోన్లు బాధితులకు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న 116 మంది బాధితులకు రికవరీ చేసిన ఫోన్లను బుధవారం ఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకూ బాధితులు పోగొట్టుకున్న మొత్తం రూ.68 లక్షల విలువైన 357 మొబైల్ ఫోన్లను ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు చెప్పారు. మొదటి విడతలో 131 మొబైల్ ఫోన్లు (విలువ రూ.25 లక్షలు), రెండో విడతలో 110 మొబైల్ ఫోన్లు (రూ.23 లక్షలు), 3వ విడత (ప్రస్తుతం) 116 ఫోన్లు (రూ.20 లక్షలు) జిల్లా పోలీస్ కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళా కార్యక్రమాల ద్వారా అందించామని తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులు జిల్లా పోలీస్ వాట్సాప్ నెంబర్ 95052 00100కు హాయ్ అని టైప్ చేసి, akpmobiletracker.in లింక్ నొక్కడం ద్వారా పోయిన మొబైల్స్ ఫిర్యాదుల స్వీకరణకు ఎఫ్ఐఆర్ కట్టకుండా, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా సులభతరం చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మొబైల్స్ ట్రేస్ చేసిన ఐటి కోర్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణ్ మూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, పైడపునాయుడు, ఐటి కోర్ ఎస్సై రఘు వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.



రికవరీ మొబైల్స్‌ను చూపుతున్న బాధితులు, చిత్రంలో ఎస్‌పి



చంద్రబాబుతో టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పీలా గోవింద

చంద్రబాబును కలిసిన పీలా గోవింద

ప్రజాశక్తి- అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును అనకాపల్లి మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా అనకాపల్లి నియోజకవర్గంలో చేస్తున్న పార్టీ కార్యక్రమాలపైనా, సమస్యలపైనా చంద్రబాబుకు వివరించారు. ఈ నెల 19న అనకాపల్లి నియోజకవర్గంలో జరగబోయే చంద్రబాబు పర్యటనపై చర్చించారు. ప్రజా సమస్యలపై మరింతగా పోరాడాలని, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, ఓటర్ వెరిఫికేషన్, హౌస్ మ్యాపింగ్‌లను వేగవంతం చేయాలని చంద్రబాబు సూచించినట్లు పీలా తెలిపారు. నియోజకవర్గంలో విస్తృతంగా కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమం, ఉపాధి హామీ కూలీలతో రచ్చబండ కార్యక్రమాలు చేయడంపై ఈ సందర్భంగా చంద్రబాబు అభినందించినట్లు చెప్పారు.

29 నుంచి నేపాల్‌లో మహాయాగం

ప్రజాశక్తి-చోడవరం : పట్టణానికి చెందిన శ్రీవేద నారాయణ ఆశ్రమం, శ్రీమాన్ సుదర్శనం సీతారామాచార్యులు ఆధ్వర్యాన ఈ నెల 29 నుంచి జూన్ 1వ తేదీ వరకు నేపాల్ దేశం ముక్తినాథ్ క్షేత్రంలో శ్రీమన్నారాయణ అష్టాక్షరీ మహాయాగం నిర్వహిస్తున్నామని ఆశ్రమం నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిమాలయ పర్వతశ్రేణుల్లో పవిత్ర గంగానదీ తీరాన సాలగ్రామ శిలలు లభ్యమయ్యే ప్రాంతంలో ముక్తి నారాయణ క్షేత్రం విరాజిల్లుతుందని పేర్కొన్నారు. అక్కడ జరుగు కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు, ఆసక్తి కలిగిన వారు స్వయంగా సంప్రదించాలని కోరారు.

ఐసిడిఎస్ భవనానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి- కశింకోట : ఐసిడిఎస్ కశింకోట ప్రాజెక్టు భవన నిర్మాణానికి అధికారులు బుధవారం స్థల పరిశీలన చేశారు. దీనికి గతంలో స్థలం కేటాయించగా, భవనం నిర్మాణం చేపట్టలేదు. ఈ నేపథ్యంలో అధికారులు ఈ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కొంకి అప్పారావు, అసిస్టెంట్ ఇంజనీర్ రవి, సచివాలయం సిబ్బంది మురళి పాల్గొన్నారు.

కర్నాటక బీజేపీ నేత మణికంఠ రాథోడ్‌పై చర్యలకు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

కర్ణాటక రాష్ట్రంలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గే కుటుంబంపై హత్యాయత్నానికి ఒడిగట్టిన ఆ రాష్ట్ర బిజెపి నేత మణికంఠ రాథోడ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్లో కాంగ్రెస్ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోయిన భానుమూర్తి యాదవ్ మాట్లాడుతూ కన్నడ ప్రజలు అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయం అందిస్తారని వివిధ దినపత్రికలు, ప్రసారమాధ్యమాల ద్వారా ప్రచారం జరిగిన నేపథ్యంలో ఈ హత్యాయత్నానికి ప్రయత్నించారని తెలిపారు. కన్నడనాట హత్యా రాజకీయాలకు బీజేపీ తెరలేపిన విషయం దినపత్రికలు, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం జరిగిందని పేర్కొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రభుత్వ భూముల ఆక్రమణలు ఆపండి

- కబ్జాదారులకు అండగా నిలవడం సరికాదు
- ఉపముఖ్యమంత్రి బూడికి సిపిఎం బహిరంగ లేఖ

ప్రజాశక్తి-దేవరాపల్లి

దేవరాపల్లి మండలం తారువ, మారేపల్లి, దేవరాపల్లి రెవెన్యూల పరిధిలోని భూ ఆక్రమణలను వెంటనే నిలుపుదల చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలు నాయుడుకు బుధవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న బహిరంగ లేఖ రాశారు. లేఖలోని వివరాలు... తారువ రెవెన్యూ సర్వే నెంబరు 179లో రెడ్డి వారి చెరువు, మరికొన్ని సర్వే నెంబర్లలో గతంలో ఉన్న తహశీల్దార్ రమేష్‌బాబు ప్రభుత్వ భూములగా గుర్తించి బోర్డులు పెట్టారు. ఆ చుట్టు పక్కల భూములు కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్రభుత్వ భూములను అడ్డగోలుగా కబ్జా చేశారు. దీనిపై వీఆర్ఒ, సర్వేయరు పరిశీలించి ఆక్రమణలు జరిగినట్లు డిప్యూటీ తహశీల్దార్‌కు తెలియజేశారు. హైకోర్టు తీర్పునకు అనుగుణంగా దేవరాపల్లి రెవెన్యూ సర్వే నెంబరు 20లో 38 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాల్సి ఉండగా, మీరు అడ్డుపడుతున్నారు. వీటితో పాటు మరికొన్ని కోర్టు వివాదాల్లో ఉన్న భూముల విషయంలో నిజాయితీగా పని చేసిన డిప్యూటీ తహశీల్దార్‌ను అనకాపల్లి కలెక్టరేట్‌కు డిప్యూటేషన్‌పై మీరు పంపించేశారన్న ఆరోపణలున్నాయి.

మారేపల్లి రెవెన్యూలో సర్వే నెంబరు 115లో 23.15 ఎకరాల దేవుని మాన్యం భూమిని మీ స్వగ్రామం తారువకు చెందిన కొంతమంది అన్యాక్రాంతం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారికి అమ్మేశారు. దీనిపై చర్యలకు ప్రయత్నించిన ఇద్దరు దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనర్లను బదిలీ చేయించారు. ఈ భూమిని అధికారులు స్వాధీనం చేసుకోకుండా మీరు అడ్డం పడుతున్నారు. దేవరాపల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 280/1లో డి.పట్టాదారుడు అయిన క్షేత్రియ దేవిసింగ్ మరణించగా, ఆ భూమిని ఆక్రమించిన వారు, చనిపోయిన సదరు పట్టాదారుని పేరున కోర్టులో కేసులు వేసి ఆ భూముల్లో ఫలసాయాన్ని పొందుతున్నారు. ఇదే రెవెన్యూ సర్వే నెంబరు 281/2లో 281/2ఎగా తప్పుడు రికార్డులు సృష్టించి ఫలసాయాన్ని పొందుతున్నారు. ఈ భూములు ఆక్రమించిన వారందరూ మీ పార్టీలో ఉన్నతస్థాయి పదవుల్లో ఉన్నవారు, వారి బంధువులే. మీ అండతో రెవెన్యూ అధికారులను కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. దీంతో ఈ భూముల్లోకి వెళ్లడానికి రెవెన్యూ అధికారులు భయపడి దూరంగా ఉంటున్నారు. చట్టాన్ని అమలు చేయవలసిన మీరు, నిజాయితీగా పని చేస్తున్న అధికారులను బదిలీ చేయడం, డిప్యూటేషన్‌పై పంపించడం వంటి చర్యలు ప్రజలకు బాధ కలిగిస్తోంది. ఇప్పటికైనా ఈ భూ ఆక్రమణలు నిలుపుదలకు రెవెన్యూ అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వాలని సిపిఎం నేత వెంకన్న ఆ లేఖలో కోరారు.

'ఉపాధి హామీ'కి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని ధర్నా

ప్రజాశక్తి - పరవాడ

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం సిఐటియు ఆధ్వర్యాన ఉపాధి హామీ కూలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉపాధి పథకానికి బడ్జెట్లో ఈ సంవత్సరం రూ.60 లక్షల కోట్లకు కేటాయింపులు తగ్గించిందని, దీంతో కూలీలకు శ్రమ తగ్గ వేతనం అందడం లేదని, పని దినాలు తగ్గుతున్నాయని తెలిపారు. రెండు పూటలా పనులు చేయించడం, ఫొటోలు, ఫేస్ యాప్ వంటి నిబంధనలు పెట్టి కూలీలను పనికి దూరం చేస్తున్నారని విమర్శించారు. గతంలో పనిముట్లకు అదనంగా డబ్బులు, వేసవి అలవెన్స్ ఇచ్చేవారని, వాటిని ఇప్పుడు తీసివేశారని తెలిపారు. ఈ పథకానికి లక్ష కోట్లు బడ్జెట్ పెంచి కోరిన అందరికీ జాబ్ కార్డులు మంజూరు చేయాలని, కొలతలతో సంబంధం లేకుండా రోజుకు కనీస కూలి రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో మంచినీరు, మెడికల్ కిట్లు, టెంట్ వంటి సౌకర్యాలు కల్పించాలని, సమ్మర్ అలవెన్స్‌లు, పనిముట్లకు డబ్బులు ఇవ్వాలని, ప్రమాద బీమా కల్పించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో వినతిపత్రాన్ని ఎంపీడీవో వి.వేమ సుందరరావుకు అందజేశారు. దీనికి స్పందించిన ఆయన పని ప్రదేశంలో మెడికల్ కిట్లు ఏర్పాటు చేస్తామని, ఇతర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మిక సంఘం నాయకులు సిహెచ్ వెంకటలక్ష్మి, పి.భవాని, రెడ్డి ముత్యాలమ్మ, ఆర్ కొండమ్మ, పి పార్వతి, పి జయ భారతి, ఎం పద్మ, ఏ పుష్ప, ఆర్ కళ్యాణి, బి వెంకటలక్ష్మి, వి నాగమణి, ఎస్ కుమారి, వెన్నెల పాలెం, భరిణికం, గొర్లెవానిపాలెం, పరవాడ, గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



ధర్నా అనంతరం ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధి కూలీలు

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలు

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యా దీవెన ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని టిడిపి పార్లమెంటరీ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రైవేటు విద్యాసంస్థలతో ప్రభుత్వం బేరసారాలు చేస్తుందని, జగనన్న విద్యా దీవెనతో అటు కళాశాలలు, ఇటు విద్యార్థులు చికాకు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఒక విడత ఫీజు ఇవ్వకుండా జగన్ ప్రభుత్వం ఎగ్గొట్టిందని తెలిపారు. ఈ ఏడాదికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పటికి మూడు విడతల చెల్లించవలసి ఉండగా ఒక విడత మాత్రమే ఇచ్చారని చెప్పారు. విద్యాసంస్థలు రూ.112 కోట్లు వదులుకుంటే మిగతా మూడు విడతలు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని చెప్పడం దారుణమన్నారు. మరో నెలలో ఫైనల్ ఇయర్ విద్యార్థుల కోర్సులు పూర్తవుతాయని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోతే కాలేజీ యాజమాన్యం సర్టిఫికెట్లు ఇచ్చే పరిస్థితి ఉండదని, ఈ క్రమంలో విద్యార్థులు అధిక వడ్డీకి అప్పులు చేయాల్సి పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఉద్యమాలు చేసే వారిపై ప్రభుత్వం కేసులు బనాయిస్తుందని ఆరోపించారు.



మాట్లాడుతున్న వైసిపి నాయకులు దాడి రత్నాకర్

జగనన్న లే-అవుట్ల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని కోడూరు పరిధిలోని జగనన్న లేఅవుట్లను జివిఎంసి 80, 81 వార్డుల కార్పొరేటర్లు కొణతాల నీలిమ భాస్కరరావు, పీలా సౌజన్య రాంబాబుతో కలిసి వైసిపి అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ లేఅవుట్లలో పనులు మందపడిగా సాగుతున్నాయని, వేగవంతం చేయాలని, మౌలిక వసతుల కల్పన చేపట్టాలని కోరారు. దీనిపై కలెక్టర్, హౌసింగ్ పీడీలను కలిసి చర్చిస్తామన్నారు. అర్హత గల ప్రతి పేదవానికి సొంతింటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పీలా శ్యామ్, దాడి ఈశ్వరరావు కర్రి అప్పాజీ, మద్దాల భీమేష్, విల్లూరి చంద్రశేఖర్, కోటిపల్లి శ్రీను, కొణతాల పరదేశి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ అప్పారావు తదితరులు

ఎంఇఒ కార్యాలయానికి చేరిన పాఠ్య పుస్తకాలు

ప్రజాశక్తి - కశింకోట

కశింకోట విద్యాశాఖ కార్యాలయానికి కొత్త పాఠ్య పుస్తకాలు వచ్చాయి. వీటిని ఎంపిడిఓ కొంకి అప్పారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా ఆయా పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయాలని మండల విద్యాశాఖాధికారి చిట్టిబాబుకు సూచించారు.

స్టీల్ గ్లాసులు పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న గోరుముద్దలో భాగంగా అందించే రాగిజావ అందించేందుకు అవసరమైన స్టీల్ గ్లాసులను పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల విద్యాశాఖ అధికారి బి.చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. ఒకటో తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 5276 స్టీల్ గ్లాసులు ప్రభుత్వం నుండి వచ్చాయని పేర్కొన్నారు. వీటిని పాఠశాలల వారీగా పంపిణీ చేస్తామని తెలిపారు.

వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

ఇటీవల భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట, పోలేపల్లి, కందిపూడి, రాజాం, సీతయ్యపేట తురకలపూడి తదితర గ్రామాల్లో రైతులు పంట భూములను ట్రాక్టర్లతో దున్నిస్తున్నారు. వీటిల్లో బొబ్బర, పెసర, మినుము, తదితర విత్తనాలు జల్లుతున్నారు. ఈ పంట ఖరీఫ్ వరి సాగుకు ముందుగానే పండుతాయని రైతులు తెలిపారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. కొంతమంది రైతులు చెరుకునాట్లు కోసం వ్యవసాయ భూములను దుక్కులు చేస్తున్నారు.



ట్రాక్టర్‌తో దుక్కు దున్నుతున్న దృశ్యం

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమయ్యేనా?

-హద్దులు, సరిహద్దులు తేలేనా?
-ప్రస్తుతం పాస్ పుస్తకాలలో దొర్లిన తప్పులు
-ఆందోళనలో రైతులు


సర్వేను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్ పొటో)

ప్రజాశక్తి -కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టే జగనన్న భూరక్ష సర్వే ద్వారా రికార్డుల ప్రక్షాళన చేసేందుకు చేపట్టిన ప్రక్రియ పట్ల పలు విమర్శలు, అనుమానాలను ఆయా గ్రామాలలో పలువురు రైతులు వ్యక్తం చేస్తున్నారు.

మండల వ్యాప్తంగా 40,480 ఎకరాలలో జరిగే సర్వేలో అటవీ, పోరంబోకు, అనాధీనం, దేవాదాయ, ప్రభుత్వ భూములు ఉన్నాయి. మండలంలో 25 గ్రామాలకు గాను 11 గ్రామాలలో గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం రోవర్లు ఉపయోగించు సర్వే చేపట్టారు. ప్రస్తుతం ఆరు గ్రామాల్లో సర్వే పూర్తి కాగా స్టోన్ ప్లాంటేషన్ జరుగుతుంది. అదేవిధంగా ప్రస్తుతం ఐదు గ్రామాలలో సర్వే చేపడుతున్నారు. స్టోన్ ప్లాంటేషన్ జరుగుతున్న రెవెన్యూ గ్రామాలు అన్నవరం సుంకపూరు, రాజుపేట, రామన్నపాలెం, ఎండపల్లి, జల్లూరు గ్రామాలు ఉన్నాయి. వీటి విస్తీర్ణం 4,751.72 ఎకరాలకు గాను 3,930 జగనన్న భూరక్ష సర్వే రాళ్లు ఏర్పాట్ల ప్రక్రియ సాగుతోంది. అదేవిధంగా సర్వే జరుగుతున్న గ్రామాలు చౌడువాడ, తంగేడు, లింగాపురం, బికేపల్లి, కోటవురట్ల గ్రామాలకు 9138.40 ఎకరాలలో సర్వే చేపడుతున్నారు.

భూ కమతానికి భూరక్షరాళ్లు వేయడంతో వివాదాలకు తావుండదని అదేవిధంగా గతంలో రైతులు భూ సర్వే చేయించుకునేందుకు రోజులు నెలలు పట్టేదని ప్రస్తుతం చేపడుతున్న సర్వే ద్వారా ఆ సమస్య శాశ్వతంగా తీరుపోతుందని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. సర్వే పూర్తయిన గ్రామాల రైతులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నేటికీ కొన్ని ప్రాంతాల్లో రైతులు తరతరాలుగా భూమిని సాగు చేసుకుంటున్నారే గాని ఆ భూమి ఎవరి పేరు మీద ఉందో హద్దులు, సరిహద్దులు తెలియని పరిస్థితి. చివరగా పాసు బుక్ చేతికి వచ్చిన తర్వాత మాత్రమే ఎవరి భూమి ఎంత? ఎవరి పేరుమీద ఉంది అనేది తెలిసేది అంటూ కొంతమంది రైతులు అనుమానంతో పాటు ఆవేదన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో బడాబాబులు తనకు అనుకూలంగా సర్వే నిర్వహించినట్లు రికార్డులు సృష్టిస్తున్నట్లు వాదనలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ భూ రక్షా పథకం భూ భక్షాపథకంగా మారకుండా చర్యలు తీసుకోవాలని పలువురు సాధారణ రైతులు కోరుకుంటున్నారు.

ఇప్పటికే సర్వే పూర్తయిన గ్రామాలలో అధికారులు భూ హక్కుపత్రాలు అందజేస్తున్నారు. అయితే ప్రస్తుతం వచ్చిన పుస్తకాలలో కొన్ని తప్పులు దొర్లాయి. కొన్ని గ్రామాలలో భూమి పూర్తిస్థాయిలో పుస్తకాల్లోకి చేరక పోవడం, హక్కు దారిని ఫోటో లేకపోవడం, ఎల్పి ఎం ఎస్ చూపకపోవడం వంటి పొరపాట్లతో పాటు భూ హక్కు పత్రాలపై జగన్ ఫోటో ఉండటం పై రైతులు కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకంగా సర్వే

ఈ విషయమై తహాశీల్దారు జానకమ్మను సర్వేపై వివరణ కోరగా ఎటువంటి వివాదాలకు తావు లేకుండా చేపడుతున్నామన్నారు.రైతుల సహకారంతోనే సర్వేతో పాటు సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉపాధి కూలీలతో సర్వే పూర్తయిన గ్రామాలకు భూ రక్ష సర్వే రాళ్లు ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఐదు రకాల సర్వే రాళ్లు ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుందని, ఏ క్లాస్ స్టోన్ ట్రై జంక్షన్ వద్ద, బి క్లాస్ బై జంక్షన్, ఎస్ మార్క్ గవర్నమెంట్ భూముల, ఎల్పీఎం స్టోన్ జరాయితి భూముల, ప్లస్ మార్క్ స్టోన్ గ్రామ సరిహద్దుల వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వేసవికాలం అదేవిధంగా సిబ్బంది కొరత కారణంగా కాస్త ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.


జానకమ్మ,
తహాశీల్దారు

100 అడుగుల రోడ్డు విస్తరణలో
భారీగా నష్టపోతాం

అధికారులను నిలదీసిన షాపు యజమానులు, వ్యాపారస్తులు


అధికారులను ప్రశ్నిస్తున్న వ్యాపారి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం అబీద్ సెంటర్ నుండి పెద్ద బొడ్డేపల్లి వరకు రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో షాపు యజమానులు, వ్యాపారస్తులతో రెండవ అవగాహన కార్యక్రమాన్ని తాత్కాలిక చైర్మన్ తమరాన నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు, మునిసిపల్ అధికారుల మధ్య తగాదా నెలకొంది. భవనాలు కోల్పోతున్నామని, దీంతో కొన్ని కోట్లు రూపాయలు నష్ట పోతున్నామంటూ యజమానులు వాగ్వాదానికి దిగారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది.

కమిషనర్ కనకారావు మాట్లాడుతూ, కౌన్సిల్ ఆమోదంతోనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామని 2022 ఫిబ్రవరిలోనే ఆమోదం తెలపడం జరిగిందన్నారు. మునిసిపాలిటీ అండర్ సెక్షన్ 266 ప్రకారం రోడ్డు విస్తరణలో భాగంగా మార్కింగ్ చేసినంత వరకు పనులు చేపడతామని ఆయన వివరించారు. ప్రభుత్వ జీవోలు, కౌన్సిల్ తీర్మానం ప్రకారం పని చేస్తుంది తప్ప ఎటువంటి ప్రలోభాలు లేవని వివరించారు. రోడ్డు విస్తరణలో మార్కింగ్ వరకు తొలగించడానికి మున్సిపాలిటీకి అధికారం ఉందని ప్రభుత్వ జీవో ప్రకారంగానే తొలగిస్తున్నామని కోల్పోయిన షాపు యజమానులకు టిడిఆర్ బాండ్లు ఇస్తామన్నారు. తుది ఉత్తర్వుల లోగా షాపులు ఖాళీ చేయాలని రిజిస్ట్రేషన్ చేయించిన యెడల లేదా ఖాళీ చేయకుండా ఉన్నట్లయితే మునిసిపాలిటీ తొలగించడం జరుగుతుందని తెలిపారు. ఆ నేపథ్యంలో ఖర్చులు యజమానులే భరించాల్సి ఉంటుందని తెలియజేశారు. చట్టం ప్రకారమే జరుగుతుందన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్

దీంతో వ్యాపారస్తులు కలుగజేసుకుని అంతా చట్టం ప్రకారమే జరిగినప్పుడు పట్టణంలో అపారి శుధ్యం ఎందుకు తాండవిస్తుందని ప్రశ్నించారు. ప్రజలు అపరిశుధ్యంతో నానా ఇబ్బందులు పడుతుంటే పారిశుధ్యం మెరుగు పరిచేందుకు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. ఓట్లేసి గెలిపించుకున్నందుకు తమకు ఎవరు ఏ నాయకులు అండగా ఉండడం లేదని ఏకపక్షంగా తీర్మానం చేసి తొలగించేందుకు సిద్ధపడటం ఏంటని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

చైర్మన్ నాయుడు మాట్లాడుతూ, సుమారు 70 వేల జనాభా ఉన్న పట్టణంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నిత్యం డివిజన్ కేంద్రమైన నర్సీపట్నంకు అనేకమంది అనేక మండలాల నుండి ప్రజలు వస్తున్నారన్నారు. ఈ తరుణంలో ట్రాఫిక్కు ఇబ్బందులు పడటం చూసి ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వద్ద విన్నవించుకోగా రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాప పనులకు చేయడం జరిగిందని నాయుడు తెలిపారు. 2018 లో ఇచ్చినటువంటి మాస్టర్ ప్లాన్ ప్రకారం గానే రోడ్డు పనులు చేస్తామని టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు.

రామ ఐరన్ షాప్ యజమాని పెదబాబు మాట్లాడుతూ అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో మునిసిపల్ అధికారులు ఉన్నట్లయితే పట్టణం అంతా అభివద్ధి చెందే విధంగా చేయాలన్నారు. అన్ని రోడ్లు విస్తరణ చేయాలన్నారు. దీనికి కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర మాట్లాడుతూ, ఒక పని ప్రారంభించినప్పుడు మిగతావి జరుగుతాయని తెలిపారు. ప్రారంభంలోనే అడ్డు తగులుకోవడం మంచిది కాదని ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్ట్యా రోడ్డు విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. దీనికి వ్యాపారస్తులు వెలగ నారాయణరావు మాట్లాడుతూ, 80 అడుగులు రోడ్లు విస్తరణలు చేసినట్లయితే తమకు ఎటువంటి టీడీఆర్ బాండ్లు, నష్టపరిహారం చెల్లించ వలసిన అవసరం లేదని తెలిపారు. 100 అడుగులు రోడ్డు విస్తరణ చేసినట్లయితే తమకు ఆత్మహత్య శరణ్యం అని చనిపోయే ముందు ఆఖరి కోరిక ఎవరైనా తీరుస్తారని ఆ కోరిక పాలకులు మున్సిపల్ అధికారులు తీర్చాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చేసిన తర్వాత మున్సిపాలిటీ అభివృద్ధి చేయండని రోడ్లు విస్తరణ చేసేందుకు తాము అనుకూలమేనని మా షాపులు పోతున్న తరుణంలో కొన్ని కోట్ల రూపాయలు నష్టపోతున్నామన్నారు. దీనిలో భాగంగా తమకు నష్టపరిహారాన్ని సంబంధిత ఖరీదు ప్రకారం చెల్లించాలన్నారు. సమావేశం ముగిసిన తర్వాత వ్యాపారస్తులు. భవన యజమానులు కార్యాలయం నుండి బయటకు వచ్చి టిడిఆర్ బాండ్లు వద్దు నష్టపరిహారం ముద్దు అంటూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలియజేశారు.


గాటీలును సన్మానిస్తున్న అంగన్‌వాడీలు

అంగన్వాడీ కార్యకర్తకు సన్మానం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో చీడిగుమ్మల అంగన్వాడీ కేంద్రం-2 కార్యకర్త గాటీలు పదవీ విరమణ కార్యక్రమం బుధవారం అంగన్వాడీ కేంద్రంలో నర్సీపట్నం, గొలుగొండ అంగన్వాడీ సిబ్బంది నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు, మాజీ మండల అధ్యక్షులు సుర్ల లక్ష్మినారాయణ, వైస్ ఎంపి పి సుర్ల ఆదినారాయణ, చీడిగుమ్మల పంచాయతీ ఉప సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ, చీడిగుమ్మల గుండుపాల అంగన్వాడీ సెక్టార్‌లు కార్యకర్తలు హాజరై ఆమె ఘనంగా సన్మానించారు.


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని చందనాడ, ఎన్ నర్సాపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఎంపీడీవో సీతారామరాజు పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. వేసవికాలం దృష్టిలో పెట్టుకుని ఉదయం ఐదు గంటలకే పని ప్రదేశానికి చేరుకుని నిర్ణీత కొలతల మేరకు పనిచేయాలని కూలీలకు సూచించారు. ప్రతిరోజు కనీసం 272 రూపాయలు వేతనం వచ్చే విధంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో గుర్తించిన పనులను పారదర్శకంగా కూలీలతో పని చేయించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. కూలీలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పని ప్రదేశంలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్, వి ఆర్ పి లు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి

వెంకటరమణకు ఘన నివాళి

ప్రజాశక్తి-మాడుగుల: ప్రముఖ నాయకులు, మాజీ సర్పంచ్ వేమవరపు వెంకటరమణ (ఎస్ పి ఎల్ రమణ) అంత్యక్రియలు బుధవారం జరిగాయి ఈయన మంగళవారం మధ్యాహ్నం మరణించారు. బుధవారం పెద్ద సంఖ్యలో అభిమానులు, బంధువులు, కుటుంబ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు తరలిరాగా ఆయన స్వగృహం నుండి శ్మశానం వరకు భారీ ఊరేగింపు మధ్య అంత్యక్రియలు జరిగాయి. ఆయన భౌతికకాయాన్ని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొని నివాళులు అర్పించారు. మంగళవారం మధ్యాహ్నం నుండి మండలానికి చెందిన వివిధ గ్రామాల ప్రజలు ఆయన భౌతికాయాన్ని సందర్శించారు. బుధవారం జరిగిన అంత్యక్రియలో ఆయన పెద్ద కుమారుడు ఎంపీపీ పెదబాబు కార్యక్రమాలు నిర్వహించారు.

కుమ్ముందానుపేటలో చోరీకి యత్నం

వరుస దొంగతనాలతో భయాందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి-వడ్డాది: బుచ్చయ్యపేట మండలం మంగళాపురం పంచాయతీ కుముందానుపేట గ్రామంలోని ఓ ఇంటిలో మంగళవారం రాత్రి దొంగలు చోరీకి యత్నించారు. గృహ యజమాని, బాది తుడు దొండా రామతులసి నారాయణ మూర్తి తెలిపిన కథనం మేరకు....మంగళవారం రాత్రి 7 గంటల నుంచి 9.30గంటల వరకు విద్యుత్ కోత కారణంగా గృహ యజమాని ఇంటి మేడ పైకి వెళ్లి పడుకున్నాడు. ఇది గమనించిన దొంగలు ఇంటి తాళంను పగులగొట్టారు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా ఐదు సార్లు వస్తూ పోయింది. దీన్ని గమనించిన దొంగలు తాళంను పగులుగొట్టినా విద్యుత్ వస్తుందేమోనని యోచించి లోపలికి ప్రవేశించకుండా వెనుతిరిగారు. 9.30గంటల తర్వాత విద్యుత్ సరఫరా కావడంతో గృహ యజమాని ఇంటిలోకి వెళ్లేందుకు తాళం తీస్తుండగా తెరిచి ఉండటాన్ని గమనించాడు. వెంటనే ఎస్ఐకు సమాచారం అందించాడు. స్పందించిన ఎస్ఐ పోలీసులను ఘటనా స్థలానికి పంపించారు. పోలీసులు ఇంటిని పరిశీలించారు.


ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

ఇదిలా ఉండగా ఈ గ్రామంలో గతంలో ఓ రైతుకు చెందిన బైక్‌ను దొంగలు అపహరించారు. అనంతరం ఓ ఇంట్లో చోరి కూడా చోటు చేసుకుంది. ఈ విధంగా చోరీలు జరుగు తుండటంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి చోరీలను నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పట్టణానికి 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం కి ఇదేం ఖర్మ అంటూ కౌన్సిలర్లు శ్రీకాంత్, దనిమిరెడ్డి మధు సెల్ఫీతో ప్రశ్నించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నాటి మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పట్టణానికి అనుకొని ఉన్న పెద్ద చెరువు అభివృద్ధిలో భాగంగా ట్యాంకు బండ్ నిర్మించాలని శంకు స్థాపన చేసి 6 కోట్ల15 లక్షలు విడుదల చేశారన్నారు. ఆ నిధులతో పెద్ద చెరువు గట్టును వెడల్పు చేసి రోడ్డు విస్తరణ పనులు చేశారన్నారు..ఆ తర్వాత కాలంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడి చెరువు అభివృద్ధికి ఏం పనులు చేపట్టారని ప్రశ్నించారు. నిధులు మంజూరు అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం సుమారు నాలుగు సంవత్సరాలు పూర్తి అవుతున్నప్పటికీ 1శాతం పనైనా పూర్తి చేయలేదని విమర్శించారు.


శిలాఫలకం వద్ద కార్పొరేటర్లు


పరామర్శిస్తున్న గంటా

మాజీ మంత్రి గంటా పరామర్శ

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండలంలో పెద్ద గుమ్ములూరు గ్రామంలో మాజీ ఎంపీపీ ఏజర్ల వినోదరాజు తల్లి మరణించడంతో బుధవారం మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తన స్వగృహానికి వచ్చి పరామర్శించారు. కుటుంబ సభ్యులుకి సంతాపం తెలిపారు.

రోడ్లు,తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వండి

మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి: గ్రామాలలో రోడ్లు, తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని మూలపేట ఎన్టీఆర్ నగర్లో బుధవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న తమకు తాగునీరు అందడం లేదని, రోడ్ల నిర్మాణం 30 ఏళ్ల నుంచి జరగలేదని ఇక్కడ ప్రజలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి అమర్నాథ్ రెండు, మూడు రోజుల్లో ఈ ప్రాంతంలో బోర్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని, రోడ్ల నిర్మాణానికి కూడా అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు మధ్యలో నిలిచిపోయిన వారు మంత్రికి తమ సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు అలివేణి, సర్పంచ్, వార్డు మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

చోడవరం : ప్రజల సంక్షేమం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. బుధవారం మండలంలో లక్ష్మీపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని స్థానిక మహిళలు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో చైతన్య, తహశీల్దారు తిరుమల బాబు, అఖిల గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ దూది సత్తిబాబు, బండి శ్రీను పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : మండలంలోని మూలపేట గ్రామంలో ఎలమంచిలి శాసనసభ్యులు యువి రమణమూర్తి రాజు, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, డిసిసిబి మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మంగళవారం పేట గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, ఆయా గ్రామాల సర్పంచులు బీశెట్టి గంగ అప్పలనాయుడు, ఆడారి కృష్ణవేణి, పిఎసిఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహన్ రావు, వైసీపీ నాయకులు పొలిమేర గణేష్, ఆడారి త్రిమూర్తులు, ఎంపీడీవో రవికుమార్, డిప్యూటీ తహశీల్దారు వినయ్ కుమార్ పాల్గొన్నారు.


ప్రజా సమస్యల తెలుసుకుంటున్న మంత్రి అమర్నాథ్

నేడు చౌడువాడలో...

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కాండ్రేగుల శశి దేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పాల్గొంటారని, ప్రజలకు ఎటువంటి సమస్యలున్నా తెలియజేయాలని కోరారు.


మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాసమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం'

విశాఖ కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, కలెక్టరేట్, విశాఖ: అర్జీల ద్వారా పరిష్కారానికి సాధ్యం కాని సమస్యలను "జగనన్నకు చెబుదాం" కార్యక్రమం ద్వారా 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేసి వేగవంతమైన, నాణ్యమైన పరిష్కారాన్ని పొందవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో "జగనన్నకు చెబుదాం" కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమీషనర్ త్రివిక్రమ్ వర్మతో కలిసి బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గడిచిన నాలుగేళ్లుగా స్పందన కార్యక్రమం ద్వారా వినతులు స్వీకరిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ సేవలను మరింత నాణ్యతతో, ఒక టైమ్‌లైన్ ప్రకారం ప్రణాళికాబద్ధంగా వేగవంతంగా పరిష్కరించే ప్రధాన ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం "జగనన్నకు చెబుదాం" కార్యక్రమాన్ని తాజాగా ప్రారంభించిందని తెలిపారు. అర్జీదారులు 1902 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కాల్ చేసి తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రత్యేకంగా నియమించిన సీనియర్ లెవెల్ ఐఎఎస్ అధికారులు నెలకు రెండు పర్యాయాలు జిల్లాల్లో పర్యటించి ఈ కార్యక్రమం అమలు తీరును పరిశీలిస్తారని తెలిపారు ఈ విధానం ద్వారా నాణ్యమైన, సంతృప్తికరమైన, పారదర్శకమైన పరిష్కారం అందుతుందన్నారు.

నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మ మాట్లాడుతూ కమిషనర్ ఆఫీస్‌లో కూడా కాల్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇది 24 గంటలు పనిచేస్తుందని చెప్పారు. ఈ కాల్ సెంటర్‌ను ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, సమాచార శాఖ ఆజెడి వి.మణిరామ్, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

సమస్యలకు సత్వర పరిష్కారం

దిక్సూచిగా 1902

అనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : 1902 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్‌చేసి 'జగనన్నకు చెబుదాం'లో రిజిస్టర్ చేసుకున్న ప్రతి సమస్యనూ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని అనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సమీక్షించి పరిష్కరించేందుకు మండల, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటుచేశామన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్‌పి కెవి మురళీకృష్ణ, ఎఎస్‌పి బి.విజయభాస్కర్, డిఆర్ఓ వెంకటరమణ, డివిఎల్‌డిఒ మంజులారాణితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏ తరహా సమస్యనైనా రిజిస్టర్ చేసుకుంటే వారికి సంతృప్తికరమైన పరిష్కారం లభించేలా తాము కృషి చేస్తామని చెప్పారు. పరిష్కారం కాని సమస్యకు కారణాలు తెలియజేస్తామన్నారు. స్పందనను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఏడాదిలో స్పందనకు వచ్చిన 18,937 అర్జీల్లో 16,441 పరిష్కారమైనట్లు చెప్పారు. అత్యధికంగా రెవెన్యూ, పంచాయతీ, పోలీసు సంబంధిత అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. మండల స్థాయిలో ఎస్ఐ, తహశీల్దార్, ఎంపిడిఓ సమన్వయంతో ఆ మండలంలో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తారన్నారు. సమస్య పరిధి, తీవ్రతను బట్టి జాప్యం జరిగినా అందుకుగల కారణాలు అర్జీదారునికి తెలియజేస్తామన్నారు. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే పర్యవేక్షణ కమిటీలో డిఆర్ఒ, ఎఎస్‌పి, డిఎల్‌డిఒ ఉంటారని తెలిపారు. నమోదైన సమస్యలపై ప్రతి శుక్రవారమూ సమీక్షిస్తామన్నారు. ప్రతి అర్జీదారునితో మాట్లాడి సమస్య పరిష్కారంపై సంతృప్తి చెందినదీ, లేనిదీ తెలుసుకుంటామని చెప్పారు. అత్యధికం గ్రామ స్థాయిలో పరిష్కారం కానున్నాయన్నారు

సమన్వయం చేసుకుంటాం: ఎస్‌పి మురళీకృష్ణ

'జగనన్నకు చెబుదాం' కింద వచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్, ఇతర ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటామన్నారు. న్యాయంలో జాప్యం జరగకుండా చూస్తామని తెలిపారు. సమస్యతో బాధపడే వ్యక్తి, తిరిగి బాధతో వెళ్లకుండా తమ పరిధిలోని విచక్షణాధికారాలను ఉపయోగిస్తామన్నారు. ఆరు పోలీసు సర్కిల్, మూడు డిఎస్‌పి, జిల్లా స్థాయిలో ఒక పర్యవేక్షణ కమిటీ ఏర్పాటుచేశామని తెలిపారు.

నక్కపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

13 మందికి గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి లో బుధవారం రాత్రి ఘోర ప్రమాదం జరిగింది. మండలంలోని పెద్దతీనార్ల, చిన్న తీనార్ల గ్రామాలకు చెందిన పలువురు హైదరాబాద్ వెళ్లి ట్రైన్‌లో తునిలో దిగారు. అక్కడి నుండి ఆటోపై స్వగ్రామాలకు తిరిగి వస్తుండగా నక్కపల్లి జాతీయ రహదారిపై తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రాంగ్ రూట్ లో వెళ్తున్న ఆటోను తుని వైపు వస్తున్న వ్యాను బలంగా ఢీకొట్టింది. దీంతోపాటు నక్కపల్లి నుండి సారిపల్లి వానిపాలెం వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని కూడా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారితో పాటు, ద్విచక్ర వాహనంపై ఉన్న భార్య భర్తల తో పాటు, వారి కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు.స్థానిక సి. హెచ్.సిలో వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు.బైక్ పై ప్రయాణిస్తున్న పెదపూడి కిరణ్, భారతి, పిల్లలు సుదీర్ లాజర్, శ్రుతి గాయపడ్డారు.


గాయపడిన క్షతగాత్రులు